## సేవాలాల్ మహరాజ్ సంఘసంస్కర్త

**- ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి**

మెదక్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా మెదక్ జిల్లా గిరిజనులకు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సేవాలాల్ మహారాజ్ గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఆధ్యాత్మిక మార్గంలోనే కాకుండా బంజారాల హక్కుల కోసం నిజాంతోపాటు మైసూర్ పాలకులకు వ్యతిరేకంగా 18వ శతాబ్దంలో సాగిన పోరాటంలో సేవాలాల్ కీలక పాత్ర పోషించారని ఎమ్మెల్సీ గుర్తు చేశారు. లంబాడాలు ఇతర మత సాంప్రదాయాల్లోకి మారకుండా సనాతన ధర్మంలోనే కొనసాగే విధంగా సేవాలాల్ కృషి చేశారన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటున్న గిరిజనులకు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి సేవాలాల్ మహారాజ్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇష్టంగా చదివితేనే విజయం



విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాశాఖ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు

రామాయంపేట, ఫిబ్రవరి 14 : విద్యార్థులు ఇష్టంగా ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం లభిస్తుం దన, ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించాలని జిల్లా విద్యాశాఖ ప్రత్యేకాధికారి ఆర్.శ్రీనివాస్‌రావు సూచించారు. బుధవారం రామాయంపేట ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి పరీక్ష భయం వీడాలని, ప్రతి సబ్జెక్టుపై అవగాహన ఉంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. పదో తరగతి విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు.

## మూల్యాంకణ కేంద్రం ఏర్పాటు చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 14 : జిల్లా కేంద్రం మెదక్‌లో పదో తరగతి మూల్యాంకణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ రాజర్షిషాకు బుధవారం తపస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో పదో తరగతి మూల్యాంకణ కేంద్రం బీహెచ్ఈఎల్‌లోని జ్యోతి విద్యాలయంలో ఉందన్నారు. జిల్లాకు మూల్యాంకణ కేంద్రం దూరంగా ఉండడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జిల్లాకేంద్రంలోనే మూల్యాంకణ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసినవారిలో తపస్ నాయకులు మాధవరెడ్డి, మార్గం రాజు తదితరులు ఉన్నారు.

## కొనసాగుతున్న 'గృహజ్యోతి'

రామాయంపేట సబ్‌స్టేషన్‌లో గృహజ్యోతి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

రామాయంపేట, ఫిబ్రవరి 14 : మండలవ్యాప్తంగా గృహజ్యోతి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నది. బుధవారం రామాయంపేట సబ్‌స్టేషన్ వద్ద ఏఈ పెంట్యానాయక్‌కు పట్టణ ప్రజలు దరఖాస్తులను అందజే శారు. వినియోగదారులు విద్యుత్ బిల్లుతో సెల్‌ఫోన్ నెంబర్, ఆధార్, రేషన్ కార్డు, ప్రజాపాలన దరఖాస్తు రసీదు అందజేయాలని సూచించారు. అన్ని గ్రామాల్లో విద్యుత్‌శాఖ సిబ్బంది వినియోగదారుల ఇంటికి వెళ్లి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది వెంకటేశ్వర్లు, పంబాల శ్రీనివాస్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

మెదక్ మున్సిపాలిటీ/ పాపన్నపేట, ఫిబ్రవరి 14 : మెదక్ మండలంలోని నార్సింగి సబ్‌స్టేషన్‌లో ఈ నెల 16న విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఆధార్‌కార్డు, కరెంట్‌బిల్లు తీసుకుని రావాలని సూచించారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పాపన్నపేట సబ్ డివిజన్‌లోని పాపన్నపేట, టేక్మాల్, పెద్ద శంకరంపేట, అల్లాదుర్గం, రేగోడ్ మండలాల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అదుపు తప్పిన బైక్.. వ్యక్తికి గాయాలు

- మానవత్వం చాటుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది
- కుటుంబీకులకు రూ.4లక్షలు అప్పగించిన పోలీసులు

క్షతగాత్రుడి కుటుంబీకులకు నగదు అప్పగిస్తున్న అంబులెన్స్ సిబ్బంది, పోలీసులు

రామాయంపేట, ఫిబ్రవరి 14 : జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి, వ్యక్తి తీవ్రంగా గాయపడి, స్పృహతప్పి పడిపోయిన ఘటన రామాయంపేట బైపాస్ వద్ద బుధవారం జరిగింది. 108 సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాలు.. పెద్దశంకరంపేట మండలకేంద్రానికి చెందిన నందగారి నరేశ్‌కుమార్ బైక్‌పై గ్రామం నుంచి రామాయంపేట బైపాస్ వద్ద బైక్ అదుపుతప్పి, రోడ్డ పక్కనే పడిపోయాడు. రోడ్డు వెంట వెళ్తున్న వ్యక్తులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రమాదస్థలంలో బైక్‌పై ఉన్న బ్యాగ్‌ను తెరిచి చూడగా డబ్బులు ఉన్నట్లు అంబులెన్స్ సిబ్బంది గుర్తించి, గాయపడిన వ్యక్తి సెల్‌ఫోన్ నుంచి కుటుంబీకులతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నరేశ్‌కుమార్ బంధువులు రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు వచ్చారు. పోలీసులు బంధువులను విచారించి, బ్యాగులో రూ.4లక్షల నగదును అప్పగించారు. మానవత్వం చాటుకున్న అంబులెన్స్ ఈఎంటీ స్వామి, పైలట్ అసిఫ్‌ను పోలీసులు అభినందించారు.

## జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

తూప్రాన్, ఫిబ్రవరి 14 : కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తూప్రాన్ బైపాస్‌లోని హల్దీవాగు బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. ఎస్సై శివానందం తెలిపిన వివరాలు.. తూప్రాన్ మండలం యావాపూర్ గ్రామానికి చెందిన పోతగోని రాంచంద్రాగౌడ్ తన పెద్ద కూతురు సంతోషిణి(44)ని చేగుంట మండలం మక్కరాజ్‌పేటకు చెందిన బాల్‌శెట్టి ప్రసాద్‌గౌడ్‌తో 30 ఏండ్ల క్రితం వివాహం చేశాడు. వీరికి ఇద్దరు కుమారులు. మూడేండ్ల క్రితం ప్రసాద్‌గౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. తండ్రి మృతి చెందిన మూడు నెలల తర్వాత పెద్దకుమారుడు అనిల్‌గౌడ్ ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతరం సంతోషిణి చిన్నకుమారుడు వేణుమాధవ్‌తో కలిసి మక్కరాజ్‌పేటలో ఉంటున్నారు. మానసిక, కుటుంబ సమస్యలతో ఈ నెల 12న సంతోషిణి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో కుమారుడు వేణుమాధవ్ తాత రాంచంద్రాగౌడ్‌తో కలిసి చేగుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం తూప్రాన్ హల్దీవాగులో మహిళ మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని చూసిన రాంచంద్రాగౌడ్ తన కూతురు సంతోషిణిగా గుర్తించాడు. మృతురాలి తండ్రి రాంచంద్రాగౌడ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం తెలిపారు.

## ప్రతి మొక్కనూ కాపాడాలి

చిలిపిచెడ్, ఫిబ్రవరి 14: హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. బుధవారం ఎంపీడీవోగా ఆనంద్ బాధ్యతలు తీసుకున్న వెంటనే ఫైజాబాద్, బండపోతుగల్ గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. మొక్కల సంరక్షణకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఎంపీడీవో వెంట ఎంపీవో శరత్‌రెడ్డి, ఈసీ భగవాన్‌రెడ్డి, కార్యదర్శి నాగరాజు ఉన్నారు.

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని శిశుమందిర్‌లో సరస్వతీ హోమం చేస్తున్న భక్తులు

మెదక్‌రూరల్: పెరూరులో కొలువుదీరిన గరుడగంగ సరస్వతీ మాత

చిలిపిచెడ్: చండూర్ ప్రాథమిక పాఠశాలలో సరస్వతీ దేవీ విగ్రహానికి పువ్వులు చల్లుతున్న విద్యార్థులు

# జ్ఞాన మూర్తి నమోనమామి

- ఘనంగా వసంత పంచమి వేడుకలు
- ఆలయాల్లో గాయత్రీ సరస్వతీ యజ్ఞం
- పల్లకీ ఊరేగింపు, అన్నదానం
- పాఠశాలలు, దేవాలయాల్లో అక్షరాభ్యాసాలు
- చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు

రామాయంపేట: భక్తమార్కండేయ ఆలయంలో రుద్రాభిషేకం చేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని శిశుమందిర్‌లో నిర్వహించిన అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు

మెదక్ రూరల్: పేరూరు సరస్వతీ ఆలయంలో అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులు

రామాయంపేట: శిశుమందిర్‌లో సాందీపని వేద గురుకులంలో హోమాలు

సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ.. విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా.. సరస్వతీ నమస్తుభ్యం సర్వదేవీ నమోనమః... మాఘ పంచమి నాడు శ్రీపంచమి, వసంత పంచమి పేరిట సరస్వతీ దేవీని ఆరాధించారు. సర్వ విద్యలకు ఆధారం వాగ్దేవి. చిన్నాపెద్దా తేడా లేకుండా పుస్తకాలు, కలాలు అమ్మవారి వద్ద పెట్టి బుధవారం పూజించారు. సంగీత, నృత్య సాహిత్యాలకూ సరస్వతీ దేవీయే మూలం కావున ఈ దేవీని నృత్యకేళీ విలాసాలతో స్తుతించారు. శిశుమందిరాలు, పాఠశాలలు, దేవాలయాల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆలయాల్లో సరస్వతీ హోమాలు నిర్వహించారు. సరస్వతీ దేవి ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సుప్రభాత సేవ, వేదపారాయణం, మహా సరస్వతీ పుష్పార్చన, పంచామృత రుద్రాభిషేకాలు, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అఖండ దీప ప్రజ్వలన, సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం అన్ని ఆలయాల్లో అన్నదానాలు చేశారు.

**- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, మెదక్, ఫిబ్రవరి 14**

## పోతిరెడ్డిపల్లి సబ్ స్టేషన్‌లో ఆపరేటర్ హత్య

నరేశ్ (ఫైల్)

కొల్చారం, ఫిబ్రవరి 14 : మండలంలోని పోతిరెడ్డిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన తట్కూరి నరేశ్ (35) సబ్ స్టేషన్‌లో నిధులు నిర్వహిస్తుండగా మంగళవారం రాత్రి హత్యకు గురయ్యాడు. విద్యుత్ ఉపకేంద్రం గ్రామానికి దూరంగా ఉండడంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడు నరేశ్‌కు స్వగ్రామం వెల్దుర్తి మండలం ఉప్పు లింగాపూర్‌లో ఇతరులతో భూతగాదాలు ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే నరేశ్‌ను హత్య చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం పోతిరెడ్డిపల్లికి చెందిన రేషన్ డీలర్ రమేశ్ పోతిరెడ్డిపల్లితండాలో ఇంటి నుంచి వెళ్తున్నాడు. సబ్ స్టేషన్‌లో ఎవరూ కనిపించకపోవడంతో అక్కడికి వెళ్లి చూడగా నరేశ్ రక్తం మడుగులో పడి ఉన్నాడు. వెంటనే కొల్చారం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చాడు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసు జాగిలం కొంగోడు వైపు కొద్ది దూరం వెళ్లి ఆగిపోయింది. ఘటనా స్థలాన్ని మెదక్ డీఎస్పీ ఫణిందర్, మెదక్ రూరల్ సీఐ కేశవులు, కొల్చారం ఎస్సై మహ్మద్‌గౌస్ పరిశీలించారు. మెదక్ రూరల్ సీఐ కేశవులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

## అడవిపంది దాడి.. రైతు మృతి

శంకరయ్య (ఫైల్)

చిలిపిచెడ్, ఫిబ్రవరి 14 : పొలంలో పని చేస్తున్న రైతుపై అకస్మాత్తుగా అడవిపంది దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఘటన చిలిపిచెడ్ మండలం అజ్జమర్రి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. అజ్జమర్రి గ్రామానికి చెందిన పన్నాల శంకరయ్య (59) రోజువారీగా బుధవారం పొలానికి వెళ్లి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో వెనక నుంచి వచ్చిన అడవిపంది అకస్మాత్తుగా శంకరయ్యపై దాడి చేసింది. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లారు. తీవ్రంగా గాయపడిన శంకరయ్యను నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు మృతుడి కుమారుడు, మాజీ ఉప సర్పంచ్ పోచయ్య తెలిపారు.

## కోళ్లపల్లి టోల్ ప్లాజా వద్ద వైద్యశిబిరం

రేగోడ్: బసవేశ్వరచౌక్ వద్ద వైద్య శిబిరం

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 14: 161వ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్సై శంకర్, నేషనల్ హైవే ప్రాజెక్ట్ ఇంజినీర్ రెహమాన్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం కోళ్లపల్లి టోల్ ప్లాజా వద్ద క్యూ బ్ హైవేస్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డ్రైవర్లతో పాటు ప్రయాణికులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎంఎస్ మేనేజర్ మోయినోద్దీన్, పీఆర్వో శివ ఉన్నారు.

### రేగోడ్‌లో వైద్యశిబిరం

రేగోడ్, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలోని బసవేశ్వర చౌక్ వద్ద కోఆప్షన్ టసభ్యుడు చోటుమియా నోవా దవాఖాన సహకారంతో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నాగేందర్‌రావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సంగమేశ్వర్, నేతలు పీర్యా నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్, ఫాజిల్, దశరథం, మాణయ్య, లతీఫ్ పాల్గొన్నారు.

## ఉసిరికపల్లిలో వ్యక్తి హత్య

శివ్వంపేట, ఫిబ్రవరి 14: శివ్వంపేట మండలం ఉసిరికపల్లిలో ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఉసిరికపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి నర్సింహులు ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన ఎరుకలి వెంకటేశ్ తన భార్యతో సన్నిహితంగా ఉంటున్నాడని నర్సింహులు అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వెంకటేశ్‌ను నర్సింహులు కత్తితో పొడిచి హత్య చేశాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు.

## అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

నర్సాపూర్, ఫిబ్రవరి 14 : అనుమానాస్పద స్థితో వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సాపూర్‌లో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాలు.. నర్సాపూర్‌కు చెందిన పాపగారి మల్లేశంగౌడ్ మంగళవారం రాత్రి పట్టణంలోని సాయికృష్ణ గార్డెన్‌లో డిన్నర్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో మల్లేశంగౌడ్ స్పృహ కోల్పోవడంతో నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. అప్పటికే మల్లేశంగౌడ్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తన భర్త మృతిపై విచారణ చేపట్టాలని భార్య మహేశ్వరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ వివరించారు.

దర్గాలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

## షాహెదల్లా దర్గా 196వ ఉత్సవాలు

**దర్గాలో ప్రార్థనలు చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే**

టేక్మాల్, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలో ప్రసిద్ధ షాహెదల్లా దర్గా 196వ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వైద్య, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహతో పాటు అందోలు మాజీ ఎమ్మెల్యే చంటిక్రాంతి కిరణ్ బుధవారం ఉత్సవాలకు హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంత్రితోపాటు మాజీ ఎమ్మెల్యేను దర్గా పీఠాధిపతి సయ్యద్ నూరుల్లా హుస్సేనీ ఖాద్రీ సన్మానించారు. దర్గా అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిమ్మ రమేశ్, కోఆప్షన్ సభ్యుడు మజహర్, నాయకులు సుధాకర్, మహేశ్‌రెడ్డి ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప, నాయకులు భాస్కర్, రవి, సలీం ఉన్నారు.

దర్గాలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

## చౌరస్తాలను సుందరీకరిస్తాం:ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 14: మెదక్‌లోని ప్రధాన రోడ్డులతోపాటు చౌరస్తాలను సుందరీకరిస్తామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జానకీరామ్ సాగర్‌తో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. మెదక్ పట్టణంలోని ధ్యాన్‌చంద్ చౌరస్తా, రాందాస్ చౌరస్తా, నర్సాపూర్ ఎక్స్ రోడ్డు చౌరస్తాను సుందరీకరిస్తామనితెలిపారు. నర్సాపూర్ ఎక్స్ రోడ్డు చౌరస్తాలో 'ఐ లవ్ మెదక్' అనే సెల్ఫీ పాయింట్‌ను సైతం ఏర్పాటు చేస్తామన్నారు. ఏడుపాయల దేవస్థానంలో రూ.80 లక్షలతో శాశ్వత షెడ్ నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మైనంపల్లి సేవాసంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం ప్రజల మద్దతుతో ముందుకెళ్తమనితెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జీవన్‌రావు, హఫీజొద్దీన్, ఆంజనేయులు, మున్నా, మంగ మోహన్‌గౌడ్, నరేందర్, గోదల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన జిల్లా అధికారులు

మెదక్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : బదిలీల్లో భాగంగా బుధవారం మెదక్ జిల్లాకు వచ్చిన అధికారులు బుధవారం కలెక్టర్ రాజర్షిషాను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్‌ను కలిసినవారిలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీపీవో యాదయ్య తదితరులు ఉన్నారు. అధికారులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

### వీర జవాన్లకు నివాళి

నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పాపన్నపేట, ఫిబ్రవరి 14 : పుల్వామా ఉగ్రదాడిలో వీర మరణం పొందిన జవాన్లను స్మరించుకుంటూ బుధవారం పాపన్నపేట జూనియర్ కళాశాల విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సతీష్, వంశీ, కృష్ణ, చరణ్, శ్రీకాంత్, మహేశ్ తదితరులు ఉన్నారు.

### నర్సాపూర్ ఎంపీడీవోగా మధులత

మధులతకు సిబ్బంది శుభాకాంక్షలు

నర్సాపూర్, ఫిబ్రవరి 14 : నర్సాపూర్ ఎంపీడీవోగా మధులత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన మధులత నర్సాపూర్‌కి బదిలీపై వచ్చారు. నర్సాపూర్ ఎంపీడీవోగా పనిచేసిన మార్టిన్ లూథర్ సిద్దిపేట జిల్లాకు బదిలీపై వెళ్లారు. పంచాయతీ సెక్రటరీలు, మాజీ సర్పంచ్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు ఎంపీడీవో మధులతకు శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు.

### కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి

నర్సాపూర్, ఫిబ్రవరి 14: ఈ నెల 16న నిర్వహిస్తున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా కార్యదర్శి నందం పిలుపునిచ్చారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 16న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో రైతులు, కార్మికులు పాల్గొనాలని కోరారు.

### అయ్యప్ప ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

రామాయంపేట, ఫిబ్రవరి 14 : పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ప్రధాన ద్వారం ఎదుట ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠాపనోత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, నాయకులు శంకరయ్య, మర్కు నగేశ్, వెంకటి పాల్గొన్నారు.

### నర్సాపూర్ ఎస్సైగా పుష్పరాజ్

నర్సాపూర్, ఫిబ్రవరి 14: నర్సాపూర్ పీఎస్ ఎస్సైగా పుష్పరాజ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తించిన శివకుమార్ సిద్దిపేట పీఎస్‌కు బదిలీపై వెళ్లారు. సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి ఎస్సైగా పనిచేసిన పుష్పరాజ్ నర్సాపూర్‌కు బదిలీపై వచ్చారు. ఎస్సై శివకుమార్ కొత్తగా వచ్చిన ఎస్సై పుష్పరాజ్‌కు బాధ్యతలు అప్పగించారు.

### నిజాంపేట ఎంపీడీవోగా రాజిరెడ్డి

నిజాంపేట, ఫిబ్రవరి 14 : నిజాంపేట ఎంపీడీవోగా రాజిరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల ఎంపీడీవోగా విధులు నిర్వహించిన రాజిరెడ్డి బదిలీపై నిజాంపేటకు వచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో రాజిరెడ్డి పేర్కొన్నారు.

### మెదక్ ఎంపీడీవోగా రఘు

మెదక్ రూరల్, ఫిబ్రవరి 14: మెదక్ ఎంపీడీవోగా రఘు బుధవారం బాధ్యతలు చేపట్టారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట ఎంపీడీవోగా విధులు నిర్వహించి రఘు బదిలీపై మెదక్ వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీవో శ్రీరాములు సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీడీవో శ్రీరాములును ఎంపీవో ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శులు సన్మానించి, వీడ్కోలు పలికారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319437-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఎ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.